

గోపాలన్నా.. మీ బిడ్డకు బుద్ధి ప్రసాదించన్నా..

గోపాలన్నా..నీబిడ్డకు మంచి బుద్ధి ప్రసాదించాలని మాజీ ఎమ్మెల్యే నిరసన తెలిపారు. - 8లో



'సాగరమాల' పనుల అడ్డగింత

సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన రైతులు తమకు పరిహారం చెల్లించాలని ఆందోళనకు దిగారు. - 8లో



యువతకు నీలం సంజీవరెడ్డి ఆదర్శం

నీలం సంజీవరెడ్డి నేటి యువతకు ఆదర్శమని ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

థియేటర్ గొడవపై కేసు నమోదు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌ఆర్ సినిమా థియేటర్ గొడవపై కేసు నమోదు చేసినట్లు 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గురువారం ఆర్‌ఆర్ సినిమా థియేటర్‌లో హరిహర వీర మల్లు సినిమా విడుదల సందర్భంగా కొంత మంది ఆకతాయిలు థియేటర్ యాజమాన్యంపై అసభ్యంగా ప్రవర్తించి గొడవ చేసి థియేటర్ ప్రధాన ద్వారం అద్దం పగులగొట్టారన్నారు. అద్దం పగులగొట్టింది చందు కాగా రవి, యేసు అనే వ్యక్తులు తాగి గొడవ చేశారన్నారు. శుక్రవారం చందు, రవిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం నిందితులను తహసీల్దారు ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. యేసు అనే వ్యక్తిని త్వరలో పట్టుకుని కౌన్సిలింగ్ ఇస్తామన్నారు.

షార్‌లో హిందీ భాషపై సదస్సు



మాట్లాడుతున్న షార్ డైరెక్టర్ రాజరాజన్

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ 'షార్'లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో శుక్రవారం హిందీ భాషపై ఒకరోజు సాంకేతిక సదస్సును షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్ ఆధ్వర్యంలో చేపట్టారు. 'అభివృద్ధి చెందిన భారతదేశానికి ఇస్రో సహకారం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఆర్ఎల్ డైరెక్టర్ ప్రొఫెసర్ అనిల్ భరద్వాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'సౌరవ్యవస్థ అన్వేషణ' అనే అంశంపై ఆయన హిందీలో ఉపన్యాసాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ ఇన్-హౌస్ జర్నల్ ప్రజ్వల్‌ను, సెమినార్ కార్యకలాపాలతో కూడిన ఒక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో షార్ అధికారులతో పాటు ఎన్ఆర్ఎస్సీ ఏడీఆర్ఐఎస్ సెంటర్‌లో పాటు ఇతర సెంటర్ల ఉద్యోగులు పాల్గొని తమ ప్రజెంటేషన్లను ఇచ్చారు.

అంధ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



అంధ క్రీడాకారుడికి సాయం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ రమేష్‌నాథ్ తదితరులు

తిరుపతి అర్బన్: అంధ క్రీడాకారుడు ముప్పాళ్ల శేషగిరి ఇటీవల జరిగిన జాతీయ స్థాయి గోల్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపాడు. సెప్టెంబర్ ఒకటిన ఈజిప్టు దేశంలోని అలెగ్జాండ్రియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎన్నికయ్యాడు. ఆ పోటీల్లో పాల్గొనడానికి శేషగిరికి ఆర్థికంగా చేయూత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అంధుల క్రీడా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంచల నరసయ్య తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను గురువారం అభ్యర్థించారు. దీనిపై స్పందించిన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ద్వారా రూ.లక్ష సాయం అందించారు. వారు మాట్లాడుతూ అంతర్జాతీయ వీధుల్లో భారత దేశ జెండా రెపరెపలాడడం మన గర్వకారణమన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుడైన శేషగిరిని అభినందించి ప్రోత్సహించడం దేశభక్తునిగా గర్వంగా ఉందని వారు తెలిపారు.

ఎర్ర చందనం కేసులో నలుగురికి జైలు



పోలీసుల అదుపులో ముద్దాయిలు

నాగలాపురం: ఎర్ర చందనం అక్రమంగా తరలించిన కేసులో నలుగురికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. 2018వ సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన శ్రీకాళహస్తి నుంచి తమిళనాడుకు 44 ఎర్ర చందనం దుంగలను రెండు కార్లలో తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో గురువారం తిరుపతిలోని ఎర్ర చందనం ప్రత్యేక కోర్టు అడిషినల్ న్యాయమూర్తి నరసింహమూర్తి తమిళనాడులోని కాంచీపురం తాలూకా శంకరాపురం గ్రామానికి చెందిన ఎం.భాస్కర్(34), పుగయేంది(30), బి.ప్రభు(35), జె.హుస్సేన్(24) అనే నిందితులకు శిక్ష విధించినట్లు ఎస్ఐ వివరించారు.

శ్రీవారి పాదాల చెంత.. గంజాయి అడ్డాగా మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది. యువతే లక్ష్యంగా గుట్టుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఎక్కువ మంది యాత్రికులు ఇక్కడికి వస్తుండడంతో పోలీసులు సరైన నిఘా పెట్టలేకపోతున్నారు. గంజాయి ముఠాలకు కొంత మంది నేతల అండదండలున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తిరుపతికి సరిహద్దున కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఉండడంతో రవాణా సులువుగా సాగిస్తూ పోలీసులకు దొరక్కకుండా ముఠాలు కార్యకలాపాలు సాగిస్తుండడం కలకలం రేగుతోంది. నగరంలో అర్ధరాత్రి గంజాయి బ్యాచ్‌లు చెలరేగిపోతున్నారు. వీరిపై పోలీసులు డ్రోన్‌లు ప్రయోగిస్తున్నా వాటికి చిక్కకుండా పాడబడ్డ భవనాలు, ఫ్లైఓవర్ కింద తలదాచుకొని పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్నారు. గంజాయి ముఠాపై పోలీసులు మరింత నిఘా పెంచకపోతే ముఠా మరింత విస్తరించే ప్రమాదం పొంచి ఉంది.



తిరునగరి చెంత.. గంజాయి దందా

- పెరిగిన గంజాయి వినియోగం
- యువతను టార్గెట్ చేసుకుని గుట్టుగా అమ్మకాలు
- మత్తులో పెరుగుతున్న హత్యలు, హత్యాచారాలు
- పోలీసులపైనా తిరగబడుతున్న ముఠా సభ్యులు
- గంజాయి ముఠాను పట్టిస్తున్న డ్రోన్ కెమెరాలు



తిరుచానూరు పెద్ద చెరువు వద్ద గంజాయి తాగుతూ డ్రోన్ కెమెరాకు చిక్కిన నలుగురు యువకులను పట్టుకున్న పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ప్రపంచ దేశాలు ఆధ్యాత్మిక నగరమని గొప్పగా చెప్పుకునే తిరుపతి నగరంతో పాటు నగర శివార్లలో గంజాయి దందా గుట్టుగా సాగుతోంది. ఒక్క గంజాయే కాదు మత్తు ఎక్కించే మాదక ద్రవ్యాలు ఎన్నో యువత భవితను చిత్తు చేస్తున్నాయి.. నిన్న, మొన్నటి వరకు వైట్‌నర్, ఫ్లూయిడ్స్‌ను ఉపయోగించి మత్తులోకి వెళుతున్న యువత తాజాగా మత్తును కలిగించే ఇంజెక్షన్లకు అలవాటు పడుతున్నారు. గంజాయి దొరకలేదంటే మత్తు కోసం తహతహలాడే కుర్రాళ్లు మత్తు ఇంజెక్షన్లతో సరిపెట్టుకుంటున్నారు. గంజాయి బ్యాచ్ మాత్రం యువకులనే టార్గెట్‌గా పెట్టుకుని గుట్టుగా అమ్మకాలు చేస్తోంది. మత్తుకు బానిసలైన యువకులకు గంజాయి ఆశ చూపించి పెద్ద ఎత్తున దండుకుంటున్నారు. మత్తుకు బానిసలైన కుర్రాళ్లు ఎంతకైనా తెగించేస్తున్నారు. హత్యలు, హత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడుతూ భయానక వాతావరణం తీసుకొస్తున్నారు.. గంజాయి ముఠాలకు రాజకీయ నేతలు అండగా నిలుస్తుండటంతో పోలీసులు సైతం ఏమీ చేయలేక వెనుదిరుగుతున్నారు.. ఒక దశలో గంజాయి బ్యాచ్ పోలీసులపైకే తిరగబడుతున్నట్టు సమాచారం. గంజాయి ముఠా పట్ల పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపితే తప్ప తిరుపతికున్న పరపతిని కాపాడలేరన్న మాట అందరి నోట వినిపిస్తోంది.

గంజాయి బ్యాచ్ ఉండేది...

తిరుపతి నగరంతో పాటు నగరానికి ఆనుకుని ఉన్న మఠం భూములు, కాలువ భూములు, చెరువులు, పాడుబడిన భవంతుల్లో గంజాయి ముఠాలు తిష్ట వేసినట్టుగా సమాచారం. దామినేడు, బాలాజీ డెయిరీ, పాడిపేట ప్రాంతాల్లో నిరుపేదలకు నిర్మించిన ఇందరమ్మ గృహాలు, రాజీవ్ గృహాల్లో గంజాయి బ్యాచ్ తలదాచుకుంటున్నట్టు సమాచారం. పోలీసులు పలుమార్లు ఆ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన గంజాయి బ్యాచ్ మాత్రం పట్టుబడలేదంటే ఏ స్థాయిలో వారికి సమాచారం అందుతుందో అర్థం చేసుకోవచ్చు. మత్తుకు బానిసలైన యువత అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ కిడ్నాప్‌లు, హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నా పోలీసులు వారిని పట్టుకునేందుకు సాహసించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. తిరుపతి నగరంతో పాటు నగర శివార్లలో ఉన్న పోలీస్ స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి గంజాయి బ్యాచ్ నుంచి బెదిరింపులు కూడా వస్తున్నట్లు సమాచారం.

కార్లు, అంబులెన్స్‌లు, రైళ్లలో తరలింపు

తిరుపతికి సమీపంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి గంజాయిని తరలించేందుకు అక్రమార్కులు కార్లు, అంబులెన్స్‌లు, రైళ్లను వాడుకుంటున్నట్టు సమాచారం. రైల్వే పోలీసుల కళ్లు గప్పి గంజాయిని గుట్టుగా తీసుకురావడం, అంబులెన్స్ డ్రైవర్లకు పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి గంజాయి ప్యాకెట్లను అక్రమార్కులు అనుకున్న ప్రాంతాలకు చేరుస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి అక్రమ రవాణాకు జాతీయ రహదారిని మార్గంగా ఎంపిక చేసుకున్నారు. జాతీయ రహదారిపై రాత్రివేళ వాహనాల తనిఖీ జరగదన్న తలంపుతో ఆ మార్గాన్ని గంజాయి వ్యాపారులు ఎంచుకున్నట్టు తెలుస్తోంది. అంతేకాక హైవే పెట్రోలింగ్ వ్యవస్థ లేకపోవడంతో అక్రమార్కులు తమ అక్రమాలకు రాచబాటగా చేసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. జూలై 1వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నాలుగు ప్రాంతాల్లో గంజాయిని పెద్ద ఎత్తున పట్టుకున్నారంటే ఏ స్థాయిలో అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. శ్రీవారి పాదాల చెంత ప్రశాంతంగా ఉండాల్సిన తిరుపతి నగరం, పరిసర ప్రాంతాలు మత్తు పదార్థాల అలజడితో వణుకుతోందని చెప్పక తప్పదు.

పాడుబడ్డ గృహాలే ముఠాకు అడ్డా

తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్, తిరుచానూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఇందిరమ్మ, రాజీవ్ గృహకల్ప పథకం కింద నిర్మించిన భవన సముదాయాల్లో పాడుబడ్డ గృహాలనే గంజాయి ముఠా అడ్డాగా చేసుకున్నట్టు సమాచారం. ఇటీవల గంజాయి బ్యాచ్ చేస్తున్న అకృత్యాలు, అఘాయిత్యాలకు నగరవాసులే కాదు, శ్రీవారి భక్తులు సైతం రాత్రివేళ భయం భయంగా తిరిగే పరిస్థితి దాపురించింది. జాతీయ రహదారితో పాటు నిర్మానుష ప్రాంతాలను ఆవాసాలుగా చేసుకున్న గంజాయి ముఠా పగలంతా ఎవరెవ్వరికి విక్రయించాలో గుర్తించి రాత్రిపూట గుట్టుగా తరలించేస్తున్నట్టు సమాచారం. పోలీసుల కళ్లు గప్పి అమ్మకాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి ముఠా నివాసముంటున్న పాత భవనాలకు వెళ్లే దారుల్లో వీధి దీపాలను పగులగొట్టేస్తుండడంతో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు దీపాలు ఏర్పాటు చేయడం మానేసినట్టుగా తెలుస్తోంది. ఇకపోతే రాత్రి వేళల్లో పోలీసులు డ్రోన్‌ల సాయంతో అసాంఘిక శక్తులను పట్టుకుంటామని పంపించే డ్రోన్‌లకు చిక్కకుండా పాడుబడిన ఇళ్లను అడ్డాగా చేసుకున్నట్టు సమాచారం.



తిరుచానూరు పెద్ద చెరువు వద్ద ఓ పాడుబడిన బంగ్లాలో గంజాయి తాగుతున్న యువకులు

యువతను మత్తులోకి దింపి



గంజాయి మత్తులో కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి దాడి చేసిన ఘటనలో బాధితుడు

ఒకప్పుడు ముంబయి, గోవా, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి మహా నగరాలకే పరిమితమైన మత్తు పదార్థాలు తిరుపతికీ విస్తరిస్తోంది. మత్తు కలిగించే వాటికి బానిసలవుతున్న యువకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటమే అందుకు కారణంగా చెప్పవచ్చు. తిరుపతి నగరంతో పాటు రూరల్ మండల పరిధిలోని నిరుపేద యువతను ఆకర్షించి వారిని మత్తుకు అలవాటు చేసి వారితో ఆ వ్యాపారం చేయిస్తున్నట్టు తెలుస్తోంది. కొన్ని చోట్ల పోలీసులే గంజాయి విక్రయించే వారితో అంటకాగి వ్యాపారాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తిరుపతి నగరానికి ఆనుకుని ఆరు వరుసల జాతీయ రహదారి సుమారు 10 కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉండటం, ఆ జాతీయ రహదారికి ఇరు వైపులా బీడు భూములు అధికంగా ఉండటంతో అక్కడ నుంచే ఈ దందాలు సాగిస్తున్నట్టుగా సమాచారం.



తనపల్లి ఇందిరమ్మ కాలనీ వద్ద 650 గ్రాముల గంజాయితో పాటు పట్టుబడిన వ్యక్తి

ఆధారాలు ఇవిగో...

జూలై 2 తిరుచానూరు గ్రాండ్‌రిడ్జ్ హోటల్ సమీపంలోని పెద్ద చెరువు వద్ద పాడుబడిన ఓ భవనంలో గుట్టుగా గంజాయి తాగుతున్న నలుగురు యువకులను డ్రోన్ కెమెరా గుర్తించడంతో పోలీసులు పట్టుకున్నారు.


జూలై 8 పుత్తూరు నుంచి వడమాలపేట మీదుగా తిరుపతికి 10 కేజీల గంజాయిని గుట్టుగా తీసుకొస్తున్న ఓ వ్యక్తిని వడమాలపేట వద్ద పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లా మీనం బల్పురం గ్రామానికి చెందిన ఆర్ముగం కందస్వామిగా పోలీసులు గుర్తించారు.

జూలై 13 తిరుపతి నగరంలోని పీకే లే అవుట్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన భువనేష్, ప్రశాంత్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు వారి నుంచి 150 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు.

జూలై 18 తిరుపతి సమీపంలోని చింతలచేను రైల్వే గేటు వద్ద 6 కేజీల గంజాయిని తిరుపతి ఈస్ట్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని ప్రకాశం జిల్లా పామూరు మండలానికి చెందిన కదంబూరు రమేష్‌గా పోలీసులు గుర్తించారు.

జూలై 22 తిరుపతి రూరల్ మండలం తనపల్లి ఇందిరమ్మ కాలనీ వద్ద 650 గ్రాముల గంజాయితో పాటు కుట్టి సతీష్‌కుమార్ అనే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు.

జూలై 23 తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో 80 వేలు విలువైన గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను ఈస్ట్ పోలీసులు పట్టుకున్నారు. పుట్టపర్తి జిల్లా చిలమత్తూరు మండలానికి చెందిన అరుణ్‌కుమార్, చంద్రమోహన్‌గా పోలీసులు గుర్తించారు.



వీధి లైట్లు లేకుండా చీకట్లో మగ్గుతున్న బాలాజీ డెయిరీకి ఎదురుగా ఉన్న రాజీవ్‌గృహ కల్ప నివాసాలు

జర్మనీ భాషపై ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: నర్సింగ్ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీ భాషపై ఉచితంగా శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన శుక్రవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తితో కలిసి శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



జర్మనీ బాషపై ఉచిత శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 68,838 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,212 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.49 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

సన్నిహితులకు రక్ష.. చిరుద్యోగులకు శిక్ష

- వైకుంఠ ద్వార దర్శన భక్తుల తొక్కిసలాట ఘటన విచారణపై ఎన్నో అనుమానాలు
- సంబంధం లేని ఉద్యోగులపై వేటు
- ఉన్నతాధికారులు, పాలక మండలికి బాధ్యత లేదా?





వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తుల తొక్కిసలాట.. గాయపడిన బాధితురాలికి ప్రథమ చికిత్స (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా జనవరి 8న తిరుపతిలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనలో ఇద్దరు అధికారులను బాధ్యులను చేస్తూ వారిని బలిపశువులను చేసి చేతులు దులుపుకున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్ల విషయంలో కీలకంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులపై ఎటువంటి చర్యలు లేకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘటన జరిగిన అనంతరం తిరుపతికి వచ్చిన సీఎం చంద్రబాబు చెప్పినట్టే నేడు చర్యలు తీసుకోవడంపై శ్రీవారి భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సన్నిహితులను కాపాడే కుట్రలో భాగంగా చిరుద్యోగులను బలిపశువులను చేశారంటూ మండిపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సైతం అనుమానాలు వ్యక్తం చేశారు. సీబీఐ చేత విచారణ చేయిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన డిమాండ్ చేశారు. వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా ఈ ఏడాది జనవరి 8న తిరుపతి పద్మావతి పార్కువద్ద నున్న రామానాయుడు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన టోకెన్ల పంపిణీ సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ ఘటనలో ఆరుగురు భక్తులు మరణించగా.. 40 మందికిపైగా తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటనపై నాడు ఎస్పీ, జేఈఓని బదిలీ చేశారు. మరో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. ఆ ఆ ఘటనపై విచారణ చేపట్టింది. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ మూర్తితో న్యాయ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. విచారణ సందర్భంగా 54 మంది ప్రత్యక్ష సాక్షులు, మృతుల కుటుంబీకులు, గాయపడ్డ వారు, వారి బంధువులు, పోలీసు, విజిలెన్స్, టీటీడీ ఉద్యోగులను కమిషన్ విచారించినట్లు తెలిపారు. తొక్కిసలాటకు ఇద్దరు అధికారులదే ప్రధాన బాధ్యత అని కమిషన్ అభిప్రాయపడినట్లు వెల్లడించారు. అందులో భాగంగా డీఎస్పీ వి. రమణకుమార్, శ్రీవేంకటేశ్వర గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిని బాధ్యులను చేస్తూ నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

ఉన్నతాధికారులపై చర్యలేవీ?

అంత పెద్ద ఘటన జరిగితే.. వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లలో కీలక భూమిక పోషించే టీటీడీ ఈఓ, ఏఈఎస్ఓ, పాలకమండలి సభ్యుల్లో ఏ ఒక్కరిని బాధ్యులను చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు వైకుంఠ ద్వార దర్శనానికి పది రోజులు పెంచి భక్తులందరికీ అవకాశం కల్పించినా చిన్న పొరబాటు జరగకపోయినా.. పది రోజులు దర్శనం పెట్టిందే తప్పు అన్నట్టు కూటమి పెద్దలు ఆరోపణలు చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. తొక్కిసలాట వెనుక ఎన్నో అనుమానాలు ఉన్నా.. నివేదికలో ఏముందనే విషయం కూడా బహిర్గతం చేయకపోవడంపైనా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మొక్కుబడి విచారణ జరిపి చేతులు దులుపుకోవటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సైతం అవే అనుమానాలను వ్యక్తం చేయడం గమనార్హం.

సన్నిహితులను కాపాడేందుకేనా..

తొక్కిసలాట అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆ రోజే వీరిద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఎందుకు సీబీఐ విచారణకు ఆదేశించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాడు సీఎం చంద్రబాబు ఏదైతే చెప్పారో.. అదే విషయాలు నివేదికలో పొందుపరిచినట్లు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. సన్నిహితులను కాపాడేందుకే ఇద్దరు అధికారులను బలిపశువులను చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే తూతూ మంత్రంగా విచారణ జరిపినట్లు వెల్లడించారు. అప్పట్లో భక్తులు చెప్పిన బాధలు, సమస్యలను పరిగణలోకి తీసుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీవేంకటేశ్వర గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి వైఎస్సార్‌సీపీకి అనుకూలురని ప్రచారం చేసి.. తొక్కిసలాటకు సంబంధమే లేని వ్యక్తిని ఉద్దేశపూర్వకంగా అతడిని బలిపశువును చేశారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

క్లుప్తంగా

పీ4పై సమీక్షల పర్వం



హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్, అధికారులు

తిరుపతి అర్బన్ : అట్టడుగుస్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పీ4 ప్రాజెక్టుపై ప్రతి రోజు సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో మూడు రోజులుగా కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షిస్తున్నారు. ఓ వైపు అధికారులతో మరోవైపు పారిశ్రామిక వేత్తలతో ఇంకో వైపు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్నారు. తాజాగా శుక్రవారం ఇదే అంశంపై సీఎం చంద్రబాబు జిల్లా అధికారులతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు డీఆర్వో నరసింహులు, ప్రణాళికశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

ఆగస్ట్ 5లోపు పీ4 మ్యాపింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాలో గ్రామాల వారీగా పీ4 సర్వే మ్యాపింగ్‌ను ఆగస్ట్ 5 లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన శుక్రవారం రాత్రి అధికారులతో పీ4పై సమీక్షించారు. ఆయన మాట్లాడు బంగారు కుటుంబాలను గుర్తించి వారి కనీస అవసరాలకు తగ్గట్లుగా మార్గదర్శకులను మ్యాపింగ్ చేయాలన్నారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు తమ లాగిన్‌లో అర్హులైన బంగారు కుటుంబాల వారిని నమోదు చేసి అనర్హులను డిలీట్ చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పీ4 ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. జిల్లా, మండల స్థాయిలో ప్రతి సమాచారాన్ని అధికారులు తమ లాగిన్‌లో అప్‌లోడ్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

గోపాలన్నా.. మీ బిడ్డకు మంచి బుద్ధి ప్రసాదించన్నా!

అభివృద్ధిని చెరపలేరు అభిమానం మరువలేరు..

- గత ప్రభుత్వ అభివృద్ధి శిలాఫలకాల ధ్వంసంపై నిరసన
- ఎమ్మెల్యే ఫ్లెక్సీలు చూడలేకున్నాడు.. శిలాఫలకాలను పగులగొడుతున్నాడు
- శిలాఫలకాలపై ప్రతాపమా?
- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం



మాజీ మంత్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి ఫ్లెక్సీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి : కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శిలాఫలకాలను ధ్వంసం చేయడంపై మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం శిలాఫలకాలను ధ్వంసం చేసిన ప్రాంతాలను ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడుతో కలిసి పరిశీలించారు. ముందుగా ఏపీ సీడ్స్ సర్కిల్ వద్ద శివం సర్కిల్ వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి, విజ్ఞానగిరి కొండ వద్ద తొలగించిన శిలాఫలకాలను, బసవయ్యపాళెం నంది సర్కిల్ వద్ద ఉన్న ధ్వంసం చేసిన శిలాఫలకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు ఉన్నారని మంత్రిగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పనిచేశారని అయితే వారి హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలు ఎక్కడా చెక్కు చెదరలేదన్నారు. కానీ ఆయన కుమారుడు ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గత ప్రభుత్వంలో చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసుకుంటూ పోతున్నాడన్నారు. గోపాలన్న నీ బిడ్డకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. అభివృద్ధికి చారిత్రక ఆధారాలుగా శిలాఫలకాలు ఉంటాయని వాటిని ధ్వంసం చేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏవిధమైన సంకేతాలు ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు.

శిలాఫలకాలను వారం రోజుల్లో పునరుద్ధరించాలి

ఏ పార్టీ కూడా శాశ్వతంగా అధికారం చెలాయించలేదని.. అది గుర్తు పెట్టుకుని మసలుకుంటే మంచిదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హితవు పలికారు. శిలాఫలకాలను వారం రోజుల్లో పునరుద్ధరించకుంటే సంబంధిత అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని కూడా అవసరమైతే ఆశ్రయిస్తామన్నారు. అధికారులు ఏ పార్టీకి తొత్తులుగా కాకుండా ప్రజల కోసం పనిచేయాలని ఇలాంటి కార్యక్రమాలకు మద్దతు ఇస్తే వారికి భవిష్యత్తులో పింఛను కూడా రాకుండా కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు.

పగులగొట్టిన శిలాఫలకాలు ఎక్కడంటే..

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన శిలాఫలకం, విజ్ఞానగిరి, నంది సర్కిల్ , శివయ్య సర్కిల్ , హరహర తీర్థం వద్ద ఉన్న శిలాఫలకం, గిరిప్రదక్షిణ మార్గంలో తొమ్మిది విడిది మండపాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను వెంటనే పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. నాయకులు ఫ్లెక్సీల్లో మా ఫొటోలు చూడలేకున్నారని అందుకే చాలా వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంలేదని చారిత్రక ఆధారాలైన శిలాఫలకాలను ధ్వంసం చేయడం మంచిది కాదన్నారు.

అనైతిక చర్య

ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో శ్రీకాళహస్తిలో 16 ఆలయాల్లో కుంభాభిషేకం చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలు ధ్వంసం చేయడం అనైతిక చర్య అన్నారు. శిలాఫలకాలపై ప్రతాపం చూపించవద్దన్నారు. అధికారులు వెంటనే స్పందించి శిలాఫలకాలను వాటి స్థానాల్లో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పసల కష్టయ్య, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీవారి సురేష్, కొత్తపాటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తరాజీ శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, డాక్టర్స్ వింగ్ ప్రెసిడెంట్ శంకర్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం, కోళ్లూరు హరినాయుడు, ఫజల్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



కుమారస్వామి తిప్ప వద్ద శిలాఫలకం చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే





కుప్పగా పడేసిన ధ్వంసం చేసిన శిలాఫలకాలు

మైనింగ్ సరిహద్దుల వివాదంపై సర్వే



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సైదాపురం : మైనింగ్ సరిహద్దుల వివాదంపై శుక్రవారం ఉన్నతాధికారులు సర్వే చేపట్టారు. జిల్లా సర్వేయర్ రఘురామరాజు, సైదాపురం ఇన్‌చార్జి సర్వేయర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో మండలంలోని పొక్కందల గ్రామ సమీపంలోని 95 సర్వేలో ఉన్న వివాదాస్పదమైన మైనింగ్ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వివరాలు ఇలా .. మండలంలోని పొక్కందల గ్రామంలోని సర్వే నంబర్‌లో సుమారు 200 ఎకరాల ఉమ్మడి భూమి ఉంది. ఈ భూముల్లో గతంలో మైనింగ్ లీజులు ఉండేవి. ప్రస్తుతం ముగ్గురికి ఆ భూములకు సంబంధించి మైనింగ్ లీజులు ఉన్నాయి. ఇద్దరు మైనింగ్ యజమానుల మధ్య భూ వివాదం ఏర్పడింది. దీంతో కొంత కాలం నుంచి తీవ్ర స్థాయిలో సరిహద్దులతో పాటు తమ భూములను ఓ యజమాని ఆక్రమించారంటూ ఉన్నతాధికారులతో పాటు కోర్టును ఆశ్రయించారు. దీంతో శుక్రవారం జిల్లా సర్వే అధికారుల పర్యవేక్షణలో ఆ భూములకు సంబంధించిన రికార్డులతో పాటు హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఐసీడీఎస్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : ఐసీడీఎస్ పరిధిలో పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పీడీ వసంత బాయి శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా జిల్లాలోని శ్రీకాళహస్తి, కోటలోని చిల్డ్రన్ హోమ్స్‌లో కుక్, నైట్ వాచ్‌మెన్, హౌస్ కీపర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్, పీటీ ఇన్‌స్ట్రక్టర్ యోగా పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పోస్టు ద్వారా లేదా కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. విద్యార్హత వివరాలు ఐసీడీఎస్ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. వయస్సు 30 నుంచి 45 లోపు వారు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తుకు ఓసీలు రూ.250, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.200 డీడీ లేదా బ్యాంక్ చెక్కు రూపంలో ఇవ్వాలని తెలియజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం విమాన, రక్షణ శాఖ గౌరవ సలహాదారుడు డాక్టర్ సతీష్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

యువతకు నీలం సంజీవరెడ్డి ఆదర్శం

తిరుపతి సిటీ : నైతికత, విలువలతో కూడిన నాయకత్వం, నిజాయతీ, ప్రజాసేవ నీలం సంజీవరెడ్డి సొంతమని ఆయన నేటి యువతకు ఆదర్శమని ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి కొనియాడారు. ఎస్వీయూ రాజనీతి, పాలనాశాస్త్ర విభాగం సహకారంతో అగ్రశ్రీ సంస్థ ఆధ్వర్యంలో వర్సిటీ సెనేట్ హాల్‌లో శుక్రవారం నీలం సంజీవరెడ్డి 3వ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రిగా వ్యవసాయ ఆవశ్యకతను తెలుసుకుని గ్రామీణ, వ్యవసాయ పురోగతికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు.ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ.. డాక్టర్ నీలం సంజీవరెడ్డి దూరదృష్టితో స్థాపించిన ఎస్వీయూ వేల మంది విద్యావేత్తలను, ప్రజా నాయకులను తయారు చేసిందన్నారు.అనంతరం రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యతిరాజులు మాట్లాడుతూ.. డాక్టర్ నీలం సంజీవరెడ్డి పేరిట రాష్ట్ర పురస్కారాలను ఏర్పాటు చేసి ఏటా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అగ్రశ్రీ సంస్థకు ఆర్థికంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహరించాలని సూచించారు. అనంతరం నీలం సంజీవరెడ్డి రాష్ట్ర పురస్కారాలను అందజేశారు. విశిష్టరత్న పురస్కారాన్ని ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డికి, న్యాయ శిరోమణిని మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషసైనారెడ్డికి, విద్యాశిరోమణిని గీతం వర్సిటీ మాజీ వీసీ దయానంద్‌కు, వైద్య శిరోమణి పురస్కారాన్ని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పూర్ణచంద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలం సంజీవరెడ్డి రాష్ట్ర పురస్కార గ్రహీతల గౌరవార్థం అగ్రశ్రీ సంస్థ ప్రచురించిన విశేష సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అగ్రశ్రీ సంస్థ సంచాలకులు డాక్టర్ డి సుందరరామ్, ఉపాధ్యక్షుడు సాయి కుమార్, ప్రొఫెసర్ మురళీధర్, మల్లీశ్వరరావు, పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు.



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, అధికారులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

కోట : ఆటోను టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చిట్టేడు వద్ద ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చిట్టేడుకు చెందిన నలుగురు కూలీలు ఉపాధి పనులకు వెళ్లేందుకు రోడ్డు పక్కన ఆటోను ఎక్కుతున్న క్రమంలో కంకర లోడ్‌తో వెలుతున్న లారీ వెనుక నుంచి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తల పోలమ్మ(63) రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కోట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి ఆమె చెందింది. గంగమ్మ, బాలమ్మ, నిర్మలమ్మతో పాటు ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

90 లక్షల పొదుపు డబ్బులు స్వాహా

- మెప్మాలో మేత
- విచారణలో బయటపడిన ఆర్పీ హేమలత అక్రమాలు
- సంఘాల డబ్బు బ్యాంకులో పొదుపు చేయకుండా చేతివాటం
- బ్యాంకు సిబ్బందితో కుమ్మక్కు
- నకిలీ రసీదులతో మోసం
- 33 పొదుపు సంఘాలకు టోకరా



డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమై వివరాలు సేకరిస్తున్న విచారణ కమిటీ సభ్యులు

తిరుపతి తుడా : తిరుపతి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అవినీతి జలగ బండారం బయట పడింది. ఆర్పీ అక్రమాలు తొలుత రూ.70 లక్షలని ఆరోపణలు వచ్చినా ఆ మొత్తం ఇప్పుడు 90 లక్షలకు తేలింది. తిరుపతి మెప్మా భాగ్యలక్ష్మి స్లమ్ లెవెల్ ఫెడరేషన్ రిసోర్స్ పర్సన్ హేమలత పై వచ్చిన ఆరోపణలతో మెప్మా డైరెక్టర్ విచారణ కమిటీని నియమించారు. వారం రోజులపాటు ఈ కమిటీ లోతుగా విచారణ చేపట్టగా ఆమె డ్వాక్రా సంఘాల ద్వారా నొక్కేసి మెక్కిన మొత్తం రూ.90 లక్షలని తేలింది. ఈ మేరకు శుక్రవారం కమిటీ విచారణలో తేలిన వివరాలను మీడియాకు వివరించారు.

అక్రమాలెన్నో..

భాగ్యలక్ష్మి స్లమ్ లెవెల్ ఫెడరేషన్ రిసోర్స్ పర్సన్ అక్రమాలు తవ్వేకొద్ది అనేకం వెలుగులోకి వచ్చాయి. డ్వాక్రా మహిళల సొమ్మును నొక్కేసేందుకు ఆమె అనేక ఎత్తులు వేశారని బహిర్గతమైంది. భాగ్యలక్ష్మి ఎస్ఎల్ఎఫ్ ఆర్పీగా ఉన్న హేమలత 33 పొదుపు సంఘాల సొమ్ము లావాదేవీలను పర్యవేక్షిస్తుంది. ఈ పొదుపు సంఘాలకు సంబంధించి నెలవారీ పొదుపు మొత్తం, రుణాల రికవరీ డబ్బులను బ్యాంకులోకి జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. బ్యాంకులో ఈ నగదును చెల్లించినట్లు నకిలీ రశీదులను చూపిస్తూ మాయ చేస్తూ వచ్చింది. ఈ విషయం బ్యాంకు నుంచి బయటకు రాకుండా అక్కడ సిబ్బందితో కుమ్మక్కైంది. కొన్ని నెలల పాటు డ్వాక్రా మహిళలు, బ్యాంక్ సిబ్బందిని మేనేజ్ చేస్తూ అక్రమాలకు పాల్పడింది. 33 సంఘాలకు సంబంధించి చేసిన మోసం రూ.90 లక్షల మేర ఉందని విచారణలో తేలింది. విచారణ కమిటీ సభ్యులు ఆర్పీ పరిధిలోని రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సభ్యుల రిజిస్టర్లు, పొదుపు పుస్తకాలు క్షుణ్ణంగా పరిశీలించగా ఈ మొత్తాన్ని కాజేసినట్లు తేల్చారు. పక్కా ప్రణాళికలతోనే అందర్నీ మోసం చేస్తూ ఆమె పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడిందని నిర్ధారణ చేశారు.

వెలుగు చూసింది ఇలా....

ఆర్పీ హేమలత పరిధిలోని ఓ సంఘం సభ్యులు నెలవారి రుణాలను పక్కాగా చెల్లిస్తూ వచ్చారు. మరోసారి రుణం తీసుకోవాలని ఆ సంఘం సభ్యులు నిర్ణయానికి వచ్చారు. ఆర్పీ నెలల తరబడి ఆ సంఘం లీడర్లను బ్యాంకు వైపు వెళ్లకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. రుణాలు ఎందుకు రావడం లేదో తెలుసుకునేందుకు ఆ సంఘం లీడర్లు బ్యాంకు వద్దకు వెళ్లారు. తమ సంఘానికి రూ.20 లక్షల రుణం కావాలని బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించారు. రికార్డులను పరిశీలించిన బ్యాంకు మేనేజర్ గతంలో తీసుకున్న మొత్తం ఇంకా చెల్లించలేదని, మీకు కొత్త రుణం ఇచ్చే పరిస్థితి లేదని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. నెలవారిగా క్రమం తప్పకుండా పొదుపు, రుణ చెల్లింపులు చేశామని ఇందుకు సంబంధించిన రసీదులు ఉన్నాయని మేనేజర్‌కి చూపించగా అవి నకిలీవని తేల్చారు. దీంతో మోసపోయామంటూ ఆర్పీ హేమలతను నిలదీశారు. ఇలా మొత్తం 33 సంఘాల పరిధిలో 27 సంఘాలకు సంబంధించి హేమలత చేసిన అక్రమాలు బయటపడ్డాయి.

బాండ్లు రాయించి చెల్లించేలా ఒప్పందం

హేమలత అవినీతి అక్రమాలు నిర్ధారణ కావడంతో ఎట్టకేలకు ఆమె తాను డ్వాక్రా సొమ్ము కాజేశానని అంగీకారం తెలిపారు. తాను కాజేసిన మొత్తం వివరాలను, మొత్తం తిరిగి చెల్లిస్తానని సంఘాలకు సైతం అంగీకార పత్రాన్ని రాసిచ్చారు. నిర్ధారణ ప్రకారం ఏ సంఘానికి ఎంత డబ్బు ఇవ్వాలి అన్న వివరాలతో బాండ్లు, చెక్కులను రాసిచ్చారు.

ఆర్పీ అవినీతితో ఉలిక్కిపడ్డ తిరుపతి

ఒక ఆర్పీ రూ. 90 లక్షల మేర అవినీతికి పాల్పడిందని నిర్ధారణ కావడంతో తిరుపతి ఉలిక్కిపడింది. తిరుపతి పరిధిలో సుమారు 47 వేల మందికి పైగా డ్వాక్రా సంఘ సభ్యులు ఉన్నారు. ఆర్పీ అవినీతి అక్రమాలు వెలుగులోకి రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. వందల మంది కళ్ళు గప్పి బ్యాంకును సైతం మోసగించిన తీరును చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. తమ సంఘాల పరిధిలో ఏమైనా అక్రమాలు జరిగాయా అంటూ మిగిలిన పొదుపు సంఘాలు ఆరా తీసేపనిలో పడ్డారు.

'సాగరమాల' పనుల అడ్డగింత

చిల్లకూరు : మండలంలోని తొణుకుమాల పంచాయతీ ఉడతావారిపార్లపల్లె సమీపంలో చేపట్టిన సాగరమాల రోడ్డు పనులను శుక్రవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. పరిహారం చెల్లించకుండా పనులు సాగిస్తుండడంపై నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ 9మంది భూముల్లో రోడ్డు నిర్మిస్తున్నారని, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా పరిహారం చెల్లించలేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధిలో వాగ్వాదానికి దిగారు. దీనిపై సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ పరిహారం నగదును ప్రభుత్వానికి అందించామని, అధికారుల ద్వారా త్వరలోనే రైతులకు చెల్లిస్తారని వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. భూహక్కుల విషయంలో కొంత గందరగోళం ఏర్పడిన నేపథ్యంలో పరిహారం చెల్లించలేదని, పూర్తి వివరాలను ధ్రువీకరించిన వెంటనే నగదు పంపిణీ చేస్తామని తెలిపారు. రోడ్డు పనులను అడ్డుకోవద్దని సూచించారు. రైతుల నుంచి వివరాలను తీసుకుని వెంటనే నివేదిక సమర్పించాలని ఆర్ఐ పూర్ణ, వీఆర్ఓ ఇంజేపల్లి శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు రైతులు సైతం ఆందోళన విరమించారు.